క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలో పూసూరు వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం సివిల్, సీఆర్‌ఎఫ్‌ పోలీసులతో కలిసి వాహన తనిఖీలను నిర్వహించారు. జాతీయ రహదారిలో వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి అందులోని బ్యాగులను పరిశీలించారు.

విద్యార్థికి సన్మానం



వాజేడు: మెడిసిన్‌లో సీటు సంపాదించిన వాజేడు జూనియర్‌ కళాశాల 2019–2021 సవత్సరంలో బైపీసీ చదివిన పూర్వ విద్యార్థి కొడారి విశారదన్‌ను కళాశాల అధ్యాపకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

ఓటర్లకు అవగాహన



మంగపేట: మండలంలోని కమలాపురంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈవీఎం, వీవీపాట్‌ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని తహసీల్దార్‌ బైరి వీరస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓటు వేసే విధానంపై స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ఓటర్లకు 10 రోజుల పాటు సంబంధిత అధికారులు, స్థానిక బూత్‌ లెవల్‌ ఆఫీసర్లు వాహనంతో వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్‌ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐ కుమారస్వామి, ఏఆర్‌ఐ ఏసుపాదం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఏటూరునాగారం: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రొయ్యూర్‌ వైద్యాధికారిని సుమలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిగ్రీ మహిళా కళాశాలలో హైజెనిక్, హెల్త్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి హెల్త్‌ చెకప్‌ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తగత పరిశుభ్రత, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, రక్త హీనత సమస్యలు రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ శివకల్యాణి, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఫీవర్‌ సర్వే



వాజేడు: మండల పరిధిలోని ఆరుగుంటపల్లి, ప్రగళ్లపల్లికాలనీ గ్రామాల్లో ఎంపీపీ శ్యామల శారద ఆధ్వర్యంలో రాపిడ్‌ ఫీవర్‌ సర్వేను నిర్వహించారు. వైద్యాధికారిని గ్యానస సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి జ్వర పీడితుల వివరాలను సేకరించారు. జ్వరాలు ఉన్న వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. కొంత మంది నుంచి రక్త పూతలను సేకరించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కోటిరెడ్డి, వెంకట రమణ, ఆశకార్యకర్తలు ప్రసన్న, మానస, కన్నమ్మ, కాంత ఉన్నారు.

గిరిజన చట్టాలను నీరు గార్చడమే లక్ష్యమా?

వాజేడు: గిరిజన చట్టలను నీరు గార్చే విధంగా సీపీఎం పార్టీ నాయకులు పని చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్‌ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 1/70, పీసా చట్టాలకు వ్యతిరేకంగా ఏటూరునాగారం, వెంకటాపురం (కె), వాజేడు మండలాలకు చెందిన గిరిజనేతరులకు కట్ట బెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం పార్టీ గిరిజన చట్టాలను అమలు చేయాలని చెపుతూ మరో పక్క తుంగలో తొక్కుతుందని విమర్శించారు. భద్రాచలం నియోజక వర్గంలో పార్టీ బలం పెంచు కోవడానికి చేసే ప్రయత్నమని వాపోయారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

వాజేడు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ విజయ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. నాగారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్‌ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న చెత్తను లేకుండా చేయడం అందరు బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతి నిత్యం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మొరుమూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించడంతో పాటు గ్రామంలో టీమోపాస్‌ మందును పిచికారీ చేశారు.



వాజేడు: చెత్తను తొలగిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ అడ్డూరి బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణంలోని చెత్తాచెదారం తోపాటు పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది, మండల పరిషత్‌ సిబ్బందితో మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌ సెంటర్‌లో మానవహారం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ, ఉప సర్పంచ్‌ దేవర కొండ ధనలక్ష్మి, ఎంపీటీసీలు కొండపర్తి సీతదేవి, గార్లపాటి రవి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..

మంగపేట: ప్రజలు భాగస్వామ్యంతో గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుమని డీఎల్‌పీఓ స్వరూప అన్నారు. స్వచ్ఛతా హీ సేవా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఎంపీడీఓ ఆలేటి సుదర్శన్‌ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల సభ్యులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించి చెత్త తొలిగించారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దుమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మమత, ఐకేపీ ఏపీఎం అప్పారావు, సీసీలు, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మంగపేటలో..



వాజేడు: మానవహారం నిర్వహిస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె)లో..



వెంకటాపురం(కె): శ్రమదానం చేస్తున్న అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం



వెంకటాపురం(ఎం): క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్‌ రజిత



వాజేడు: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వెంకటాపురం(ఎం): క్రీడలతో మానసికోల్లాసం కలుగడంతో పాటు స్నేహాభావం పెంపొందుతుందని సర్పంచ్‌ డొలి రజిత అన్నారు. బుధవారం మండలంలోని పాలంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు నిర్వహించిన 67వ స్కూల్‌ గేమ్స్‌ ఫేడరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌జీఎఫ్‌) క్రీడలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మండలంలోని 10 పాఠశాలల నుంచి 215 మంది విద్యార్థులు పాల్గొనగా, 96 మందిని ఏటూరునాగారంలో జరిగే జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు బల్గూరి వేణు తెలిపారు. పీఈటీలు శరత్‌రెడ్డి, జగదీష్, లవణిక, నాగేందర్, సుజాత, కుమార్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, అనిల్‌కుమార్, అనిత పాల్గొన్నారు.

వాజేడు: మండలంలోని మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను మొరుమూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు.

పెంచిన వేతనాలను విడుదల చేయాలి

ములుగు రూరల్‌: వంట కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిందర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రం లోని విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట కార్మికుల అక్రమ తొలగింపులను నిరోధించాలని అన్నారు. విద్యార్థులకు మోనూ చార్జిలను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి, మీనాకుమారి, సమ్మక్క, రాజకుమారి, శోభ, రమ, పోశమ్మ, కమలక్క, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వంట కార్మికులు

ఆస్పత్రిలో డెంగీ చికిత్స అందించాలి

ఏటూరునాగారం: సామాజిక ఆస్పత్రిలో డెంగీ పరీక్షలు చేయడం కాదని, పూర్తి స్థాయిలో చికిత్సలను రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ గద్దం భిక్షపతి గౌడ్‌ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని బీఎస్పీ నాయకులు తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్‌ ఫీవర్స్‌ వంటి పరీక్షలను పరిశీలించారు. డెంగీ పేషెంట్లకు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్నరు. ఆస్పత్రిలో ఉన్న స్వీపర్లు, అటెండర్లు, ఇతర విభాగాలను నడిపిస్తున్న కనకదుర్గ ఏజెన్సీని తొలగించాలని, వారు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపెల్లి వీరస్వామి, భాగ్యలక్ష్మి, యాకూబ్‌పాషా, కిషోర్, రాజు పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న బీఎస్పీ నాయకులు

వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరంలో కాఫెడ్‌ సిబ్బంది, వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తత అవసరం అని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని సీతరామ్‌పురం గ్రామంలో బుధవారం కాఫెడ్‌ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్‌ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్‌ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్‌ లూర్దురాజ్, మండల కొఆర్డినేటర్‌ గొంది హనుమంతు, వాజేడు మండల కోఆర్డినేటర్‌ కామేష్, సిబ్బంది ప్రశాంత్, నరేష్, ఇందిర, పద్మ, ఉష, రమాదేవి, భాస్కర్, ప్రసాద్‌ తదితరులు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్ట పోయిన వరద బాధితులకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి ఆదుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం హనుమకొండ ఐవీవై ఇంటర్నేషనల్‌ స్కూల్‌ యాజమాన్యం అధ్వర్యంలో రూ.1లక్షల, హైదరబాద్‌ కొండగల్‌కు చెందిన నర్సింమయ్య రూ.1 లక్ష నగదు అందించగా గురువారం మేడారంలోని వరద బాధితులకు రూ.వేయి చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఐవీవై ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో చదువుతున్న పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్‌ మనీని పొదుపు చేసుకొని వరద బాధితులకు సాయం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు సమ్మక్క సారలమ్మల దీవెనలు ఉంటాయన్నారు. కొడంగల్‌కు చెందిన నర్సింమయ్య రూ.1 లక్ష అందించడంపై ఆయకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు మంత్రులు మేడారానికి సందర్శనకు వస్తున్న సందర్భంగా మేడారం జంపన్నవాగు వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు ఇరుసవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం జెడ్పీటీసీ కరంచంద్‌ గాంధీ, తాడ్వాయి మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షులు జాలపు అనంతరెడ్డి, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఎండీ అఫ్సర్‌ పాషా, బ్లాక్‌ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షులు ఎండీ ముజాఫర్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు పాక సాంబయ్య, తాడ్వాయి సర్పంచ్‌ ఇర్ప సునిల్, సర్పంచులు అశ్విని, సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌ బేజ్జురి శ్రీనివాస్, ఎస్టీ సెల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి పిరీల వెంకన్న, తాడ్వాయి మండల యూత్‌ అధ్యక్షులు కోడి సతీష్, నాయకులు చిరంజీవి, నరేష్, శ్రీనివాస్, రామయ్య, రమేష్, మల్లయ్య, పాక రాజేందర్, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌ఎస్‌ తాడ్వాయి: విద్యార్థులు అందించిన సాయాన్ని చూపుతున్న ఎమ్మెల్యే సీతక్క

కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

ములుగు: ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా అని ఎమ్మెల్యే డాక్టర్‌ ధనసరి సీతక్క అన్నారు. ఆరోగ్య కారణాలతో ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆమె బుధవారం అందజేసి మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యవచ్చినా స్థానిక పార్టీ కార్యకర్తల ద్వారా కాని నేరుగా కానీ సంప్రదించవచ్చని అన్నారు. విజయభేరీ సభకు ములుగు నుంచి వేలాధిగా తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు బానోత్‌ రవిచందర్, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు కంబాల రవి, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, పాలడుగుల రామకృష్ణ, ముక్తి రామస్వామి, ఎస్కే గౌస్‌ తదితరులు పాల్గొన్నారు.



ములుగు: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కాంగ్రెస్‌ పార్టీలో పలువురు చేరికలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌ పార్టీలో చేరగా ఎమ్మెల్యే సీతక్క బుధవారం వారి కండువలను కట్టి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాబోయేది కాంగ్రెస్‌పార్టీనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు, అరుణ, వెంకన్న, వేణు, లక్ష్మీనారాయణ, దేవేందర్, ఎల్లయ్య, రమేష్, దుర్గేష్‌ పాల్గొన్నారు.

గణేశ్‌ మండపాల వద్ద అన్నదానం



వెంకటాపురం(ఎం): అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న, అశోక్, రామ్మోహన్‌రావు



వాజేడులో..

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేటలో వినాయకుడి మండపం వద్ద గణపతి యూత్‌ ఆధ్వర్యంలో బుధవారం మహాన్నదాన కార్యక్రమాన్ని చల్లకొండ రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ గై అశోక్, మాజీ సర్పంచ్‌ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత వడ్డెపల్లి శంకర్, యూత్‌ సభ్యులు రౌతు దేవేందర్, శ్రీనివాస్, మహేష్, సంపత్, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలోని సిద్ధివినాయక ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్‌ బిల్లుపై హర్షం

ములుగు రూరల్‌: మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం హర్షనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ పాలనలో సాధ్యంకాని అనేక సమస్యలను బీజేపీ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణి నాయక్, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, భూక్య రాజునాయక్, గాజుల కృష్ణ, నగరపు రమేష్, భూక్య జవహర్‌లాల్, విజయ్‌కుమార్, సాంబశివరెడ్డి, రవీంద్రాచారి, వాసుదేవరెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ములుగు రూరల్‌: మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి



ఏటూరునాగారం: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏటూరునాగారం: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి మహిళలు, నాయకులు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈక మహాలక్ష్మి మాట్లాడారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి బీజేపీ కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి బాసాని సుగుణ, నాయకులు పలక గంగా, ఆత్కూరి ప్రేమలత, రజిని, మండల అధ్యక్షుడు గండేపల్లి సత్యం, నాయకులు వావిలాల జనార్దన్, గద్దం సత్యం, గద్దల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామ శివారులో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్సై బి.మాన్‌సింగ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన నూనవత్‌ సమ్మయ్య అనే వ్యక్తి అందుకుతండా గ్రామ శివారులోని జామాయిల్‌ తోటలో గుడుంబా తయారు చేస్తున్నడు అనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఆరు వందల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా, సమ్మయ్య పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది రఘుపతి, బాలకృష్ణ, విష్ణువర్ధన్‌ తదితరులు ఉన్నారు.



దాడుల్లో పాల్గొన్న ఎస్సై మాన్‌సింగ్, సిబ్బంది

విద్యార్థులకు గొడుగుల పంపిణీ



కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాకా వెంకటస్వామి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, బీజేపీ కార్యవర్గ సభ్యుడు వివేక్‌ ఆదేశాల మేరకు బుధవారం ఫౌండేషన్‌ సభ్యులు, బీజేపీ నాయకులు గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో కాకా ఫౌండేషన్‌ ద్వారా గొడుగులు అందజేసినట్లు పేర్కొన్నారు. మున్ముందు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో పాఠశాలలో బెంచీలతో పాటు విద్యార్థులకు నోట్‌బుక్‌లను ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గం తిరుపతి, మహిళా మోర్చా జిల్లా జనరల్‌ సెక్రటరీ ఉడుముల విజయారెడ్డి, నాయకులు గంట అంకయ్య, వెంకట్‌రెడ్డి, మంత్రి సునీల్, రవి, శ్రీశైలం, రాజు పాల్గొన్నారు.